# కలలో....కథ....!

శ్రీ "మహేశ్వర్"

కలలో వలవన్ని ఓ కన్యకనిపట్టేను!
కలలో కథ.
కథలో కల! వలపులపిల్ల!!
అదే కథారాణి—కలలరాణి!

బొమ్మలాటి అమ్మాయ్—బొమ్మలా నుంచుంది.

కొమ్మకి చిగుళ్ళు తోచినట్టుగా, అమ్మాయ్ పెదవులకు నవ్వులు పూచినై.

నవ్వులపిల్ల కిలకిల్లాడుతోంది.

పువ్వులు పూచింపిస్తోంది—పూజిస్తోంది ఎవర్నో—హృదయంలో!

పిల్లని వల్లోవేసి కల్లోనే అడుగుతున్నాంట—

పరాయిదాంతో సంభాషణోపక్రమానికి సంసిద్ధమయ్యాను.

కలలోపిల్ల మెల్లగా కదిలింది—వినాయకుడిబొజ్జమల్లే ఉన్న కడుపుతో భారంగా ఊపిరిలాగుతోంది!

వెనకటికి మా మరదలొహర్తె కడుపుతోఉండి చచ్చిపోయింది లెండి! చచ్చినవాళ్ళకేమేనా కోరికలుంటే, తమకి ప్రియమైనవాళ్ళ కలలో కనబడి తమకోర్కెలు తీర్చుకుంటారట! అలా మా మరదలే కల్లో కనబడి తన కోర్కెలు తీర్చమంటుందేమో అని నిదానించిచూసేను—కాదు—మా మరదల్లాలేదు—మరోపిల్ల. నిండుచూలాలు.

"ఎవ్వరిదానవీవు జవరాలా!
చూలాలివై ఇటులేల...?"

అని కవిత్వధోరణిలో అడగడం పూర్తికాకుండానే—అందుకుంది.

"నేను...నే...నూ...అనాథని....ఓ నిర్భాగ్యుడివల్లోపడి ఈగతికి..!" అనివూరుకుంది.

"ఓ నిర్భాగ్యుడివల్లోపడి—ఇప్పుడు నాకల్లో పడ్డావ్—కారణమేమిటి—" అని ఆమెకేసిచూస్తూ—

కడుపుతోఉన్న ఆడది కల్లోకనబడితే ఫలితమేమిటో పిడవర్తివారి పంచాంగం రిఫర్ చెయ్యాలనుకుంటూ, ఆమె ఆద్యంతాలు కనుక్కోవాలన్న కుతూహలంతో నాంది!

"నెలతా నెల తప్పేవా!
సుదతీ సూడిదతేనా?"

అని భక్తిలో—అడిగేసరికి—

"సూడిదా ఒద్దు, గాడిదాఒద్దు" అంది రోషకషాయితనేత్రాల్తో.

* * *

"మీరు చలాన్ని ఎరుగుదురా?" అంది.

ఓరి బాబోయ్—ఈమెవరా అన్నీతెలిసినదాన్లాగేఉంది. అంతా తెల్సుకోకుండా ఒదలకూడదని తీర్మానించి, నేనూ నామనస్సూ సదరు తీర్మానాన్ని ఆమోదించి (ఏకగ్రీవంగా అనడం మరచినందుకు క్షమాపణ) స్త్రీలోకంలోకూడ చలాభిమానులున్నందుకు సంతసించినవాడనై,

"ఓ—చలాన్ని ఎరగనివారెవరు? మనసంఘంలో గొప్ప రివల్యూషన్ తెచ్చిపెట్టిన ఆ మహానుభావుడితో నీకేమవసరం?"

"అతను నాకవసరం లేకపోయినా, నాలాటి ఆడివాళ్ళ అతనికెందరో అవసరం.

ఒక ఆడదాన్ని తీసికెళ్ళి పదిమంది మొగాళ్ళతో కలపడమేగా అతని సంస్కరణోద్దేశం!" అంది నేలను కాల్తోరాస్తూ—

"ఇప్పటికి నిన్నెందరు ముడెట్టుకున్నారు" అన్నాను శాంతంగా.

"నన్నెవరు ముడెట్టుకుంటారు? నన్ను ముడెట్టుకున్నవాడు ఉరెట్టైకు చావాల్సిందే." అంది.

"అంత మడికట్టుకున్నదానికీ ప్రారబ్ధం ఏమిటి"" అన్నాను ఆమె కడుపుకేసి ఉడుకుగాచూస్తూ.

కల తేలిపోతోంది—రెప్పలు బరువెక్కినై—జరగాల్సిన కథ బోలెడుంది.

మళ్ళా అందుకుంది!

"చలం రాసేబూతులకి లోకం చెడిపోతోంది!" అంది, ఆ చెడిపోయినవాళ్ళలో తనొహర్తె, అన్నట్టుగా చూస్తూ—ఇహ తను బాగుచెయ్యడానికి బయల్దేరుతుంది కామోలు!

"చలం గ్రంథాలు చదివి లోకం బాగుపడుతోంది—సంఘంలో కుళ్ళు బయటపడుతోంది" అన్నాను.

"లోకంలోఉన్న ప్రతీ ఆడదాన్ని తనదానిగా చేసుకున్నట్టు మాట్టాడతాడు" చెలం—

"ఏదీ—అంతటి విశాలహృదయుణ్ని మరొహణ్ణి చూపించు ఈ లోకంలో—అతనిగుండె ఎంతలోతైంది కాకపోతే అంతమంది ఆడాళ్ళని భరించగలడు?" అన్నాను చలంమీద నాకున్న యాపదాభిమానం ఒంపుతూ.

"మొహం! అన్నీకదల్లో రాసుకుని సంతృప్తిపడ్డమే! బూతుల బుంగ—" అని కొరకొరలాడింది.

"అతనురాసినవి బూతులని నీకేంతెల్సు?" అన్నాను.

"అతను రాసిన ప్రతి అక్షరం చదివేను; అక్షరానికి అనేకబూతులు!" అంది ఉక్రోషం ఒంపుతూ.

బూతు—బూతు—అని అంతగా తిడ్తూన్న ఆమెని బూతు నిర్వచించమని అడుగుదామనుకున్నాను: కాని చలం గ్రంథాలన్నీ చదివిన ఆడది కనబడ్డంచేత అన్నీమరచి—

"నీ అనుభవం తక్కువ! వాస్తవికవిషయాల్ని ఉన్నదున్నట్టుగా చిత్రిస్తే అది బూతుగా కనబడుతుంది. లోతుకుపోయి చూడ్డానికి నీలాటి వాళ్ళకి ధైర్యం చాలక ఏవేవో అని పతివ్రత్యపు బురఖా తొడుగుని లోకాన్ని మెప్పించ చూస్తారు!"

"అయితే నువ్వన్నది: బజార్లో కనబడ్డ ప్రతిమొగాణ్ణీపట్టుకు లాగమనా?"

"అలా అని అతడుచెప్పాడా? నువ్వుతిన్నగా అర్థం చేసుకోకుండా మాట్లాడుతున్నావ్! నువ్వు సహృదయపూర్వకంగా వాంఛించే ఎందరైనా అనుభవించొచ్చు—కావాల్సింది "హృదయం" కాని "శరీరం" కాదు—శరీరాన్ని కాంక్షించే వాళ్ల పశువులనే విషయం తెల్సుకో. 'మొగుడు' అనే గీతగీసి ఆదిదాటితే హిందూస్త్రీ నరకకూపంలో పడిపోతుందని, సీతా, సావిత్రీ, కథలు సృజించి వినిపించేరు. అలాంటి ముసలి నమ్మకాల్ని అభిప్రాయాల్ని ఛేదించి, నిజాన్ని ఎరుకపరచాలనే చలం అవతరించేడు—ఇంకెవ్వరికీ సాధ్యంకాదు—" అని ఒక్కఉపన్యాసం దంచేను.

"ఆబూతుల్లో ఇంతంత నీతులున్నాయని నాకుతెలీదు—కాని సహృదయంతో వాంఛించే ఎందరి మొగాళ్ళకైనా ఒక స్త్రీని ఒప్పచెప్తావా?" అనడిగింది.

తల గిర్రునతిరిగింది—నా అభిప్రాయాలన్నీ తల్లకిందులైనై! మంచంమీదనుండి ఒరిగి కిందపడే సమయంలో తెలివితెచ్చుకుచూస్తే గడియారంలో ఉదయం ఏడున్నర!